ఇక ఇళ్లూ.. రెడీమేడ్

ఇల్లు కట్టి చూడు అనే నానుడిని వెనక్కు తోసి రెడీ టు అక్యుపై అంటూ వచ్చేశాయి రెడీమేడ్ ఇళ్లు. భవన నిర్మాణ మెటీరియల్ కొరత, అదుపు తప్పిన రేట్లు, లేబర్‌తో ఝంఝాటాలు లేకుండా నిర్మాణాలు సాఫీగా సాగిపోతున్నాయి. అనుకున్న రోజుకు అనుకున్న బడ్జెట్‌లో నిర్మాణం పూర్తవుతున్నాయి. ఆనందపురం మండల శివారులో జోరుగా సాగుతున్న ఈ రెడీమేడ్ ఇళ్లు, దుకాణాలపై ఓ లుక్ వేసేద్దామా మరి..


నిర్మాణంలో సింగిల్ బెడ్‌రూమ్ ఇల్లు

- జోరుగా కంటెయినర్ మోడల్ నిర్మాణాలు
- ఖాళీ స్థలాల్లో నేరుగా పోర్టబుల్ క్యాబిన్లు
- మెచ్చిన చోటుకు నచ్చిన సమయంలో తరలించే వీలు

SUNDAY SPECIAL

తగరపువలస: ఇంటి నిర్మాణం ఎంతో శ్రమ, ఖర్చుతో కూడుకున్నది. వాటికి చెక్ పెడుతూ వచ్చేశాయి రెడీమేడ్ ఇళ్లు. ఆనందపురం మండల శివారులో ఈ రెడీమేడ్ దుకాణాలు, ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. వినియోగదారుల అభిరుచి మేరకు నిర్వాహకులు వారంలో నిర్మించి అందిస్తున్నారు. పోర్టబుల్ క్యాబిన్లుగా పిలుచుకునే వీటిని ఖాళీ స్థలాలలో పెట్టుకుని నేరుగా వినియోగించుకోవడమే తరువాయి. కంటెయినర్ మోడల్‌గా పిలుచుకునే వీటిని ఆర్డర్ ఇచ్చిన వెంటనే నిర్వాహకులు డెలివరీ చేస్తున్నారు.

కోరిన వసతులన్నీ సిద్ధం

అనుకున్నదే తడవుగా అవసరమైన నిర్మాణాలు సిద్ధం చేస్తున్నారు. వీటిలో 44 చదరపు అడుగుల టాయిలెట్లు(రూ.85వేలు), 10X10 ఆధునిక టీ దుకాణాలు (రూ.12లక్షలు), 20X12, 26X12, 26X10సైజులలో బెడ్‌రూమ్, వంటగది, హాల్, టాయిలెట్లతో కూడిన సింగిల్ బెడ్ రూమ్‌లు (రూ.3 లక్షల నుంచి రూ.3.50లక్షలు), 40X12 సైజులో డబుల్ బెడ్‌రూమ్‌లు (రూ.5లక్షలు), ఇంకా అవసరమైన ఎక్కువ వసతులతో కార్యాలయాలు, తక్కువ వసతులతో సెక్యూరిటీ క్యాబిన్లు అందిస్తున్నారు. అవసరాన్ని బట్టి ఫ్యాన్లు, లైట్లు, కప్‌బోర్డులు, హ్యాండ్‌వాష్ కమోడ్ వసతులు కల్పిస్తున్నారు. పైపుల సాయంతో ఫస్ట్ ఫ్లోర్ నిర్మాణాలు కూడా చేస్తున్నారు. జీఎస్‌టీ, రవాణా, లోడింగ్ చార్జీలు తయారీదారులే భరించగా అన్‌లోడింగ్ చార్జీలు వినియోగదారుడు భరించవలసి ఉంటుంది. వినియోగదారులు కోరిన చోటుకు భారీ వాహనాలతో చేరుస్తున్నారు. ఉత్తరాది కార్మికులు వీటి నిర్మాణ పనులు చూస్తున్నారు.






నిర్మాణంలో ఉన్న దుకాణం, కార్యాలయం, సెక్యూరిటీ క్యాబిన్


వాష్ రూమ్ నిర్మాణం

కూలింగ్ షీట్లు.. గ్లాస్ డోర్లు

ఈ ఇళ్లు, దుకాణాలను 20 నుంచి 25 ఏళ్ల మన్నికతో పాటు వాటర్ ప్రూఫ్, ఫైర్ ప్రూఫ్ మెటీరియల్‌తో అందిస్తున్నారు. మూడేళ్లకోసారి బయట వీటికి పెయింటింగ్ చేసుకోవడం వలన జీవితకాలం పెంచవచ్చు. దృఢమైన జీఏ పైపులు, నేలపై, సీలింగ్, గోడలుగా సిమెంట్ షీట్లు, ఎండల నుంచి చల్లదనానికి కూలింగ్ షీట్లు, వెంటిలేషన్‌కు పీవీసీ, గ్లాస్ డోర్లు, కిటికీలు అందిస్తున్నారు. మిగిలినవి సాధారణ ఇళ్లకు వినియోగించినట్టే ఫ్యాన్లు, లైట్లు, వాష్‌రూమ్, వార్డ్‌రోబ్, ప్లంబింగ్ పనులు కూడా ఇందులో ఉంటున్నాయి. ఇంటిపై ఏర్పాటు చేసుకునే వాటర్ ట్యాంకు తప్ప మిగిలిన వసతులన్నీ కల్పిస్తున్నారు.



నచ్చిన చోటకు మార్చుకోవచ్చు

రెడీమేడ్ దుకాణాలు, ఇళ్లు నచ్చినప్పుడు, నచ్చినచోటుకు మార్చుకోవచ్చు. దీనికి పెద్దగా ఖర్చు కూడా ఉండదు. ఇళ్లకు పెయింటింగ్ మాదిరిగా మూడేళ్లకోసారి నిర్వహణ చేసుకోవచ్చు. శాశ్వత భవనాలతో పోలిస్తే ఖర్చు కూడా తక్కువే. గతంలో నేను తక్కువ ఖర్చుతో దుకాణం తయారు చేయించి, నిర్వహిస్తున్నాను. సౌకర్యంగా ఉంది.

– మేరుగు చిన్నారావు, మంగమారిపేట

క్లుప్తంగా

వేమన జయంతి కరపత్రం ఆవిష్కరణ


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ వెంకటప్పుడు

భీమునిపట్నం: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి జ్ఞానవేదిక కమిటీ ఆధ్వర్యంలో విజయనగరంలో ఈ నెల 19వ తేదీ ఆదివారం యోగి వేమన జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమ కరపత్రాన్ని భీమిలి మండలం సింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేట వద్ద జెడ్పీటీసీ గాడు వెంకటప్పుడు చేతులమీదుగా శనివారం ఆవిష్కరింపచేశారు. కార్యక్రమంలో ఊరేగింపు, పూజలు జరుగుతాయని, వేమన పద్యాల గురించి తెలియపరచడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సింగనబంద సర్పంచ్ గాడు వెంకటనారాయణ పాల్గొన్నారు.

వెల్లంకిలో ఆక్రమణల తొలగింపు


ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

మధురవాడ: ఆనందపురం మండలం వెల్లంకి గ్రామంలో రెవెన్యూ అధికారులు శనివారం ఆక్రమణలు తొలగించారు. సర్వే నంబరు 292/2లో ఉన్న 50.76 ఎకరాలు కొండ పోరంబోకు ప్రభుత్వ భూమిలో 5సెంట్ల విస్తీర్ణంలో కొందరు వ్యక్తులు రెండు భారీ రేకుల షెడ్ల నిర్మాణం చేసి ఆక్రమణకు పూనుకున్నారు. ఇక్కడ జరుగుతున్న ఆక్రమణపై స్థానికుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు ఆర్ఐ రీనా ఆధ్వర్యంలో వీఆర్వో ఎస్.రామకృష్ణ, ఇతర సిబ్బంది ఆక్రమణలు తొలగించారు. ప్రభుత్వ భూమి పరిరక్షణకు చర్యలు చేపట్టారు.

ఎన్‌టీఆర్‌కు ఘన నివాళి


చిన్నబజార్ జంక్షన్ వద్ద ఎన్‌టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు

భీమునిపట్నం: మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు వర్ధంతిని భీమిలిలో ఘనంగా నిర్వహించారు. మూడో వార్డులో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు ఆధ్వర్యంలో చిన్నబజారు జంక్షన్ వద్దనున్న ఎన్‌టీఆర్ విగ్రహానికి నాయకులు నివాళులు అర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రోగులకు పండ్లు, రొట్టెలు అందించారు.

పద్మనాభం: పద్మనాభం జంక్షన్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె.దామోదరరావు, మాజీ ఎంపీపీ లీలావతి, పార్టీ అధ్యక్షుడు రమణ పాల్గొన్నారు.

జీవామృతంతో అధిక దిగుబడి


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మధురవాడ: వ్యవసాయంలో రైతులు రసాయన ఎరువులకు బదులు ద్రవ జీవామృతం, ఘన జీవామృతం వాడడం వలన పెట్టుబడులు తగ్గి, అధిక దిగుబడులు పొందవచ్చునని జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి మోహనరావు తెలిపారు. 'ప్రకృతి వ్యవసాయం, కాంపాక్ట్ బ్లాక్‌లో రబీ డ్రై సోయింగ్' పై ఆనందపురం మండలం పాలవలస గ్రామంలో రీజనల్ వ్యవసాయ అధికారి ప్రకాశ్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రైతులు 5 రకాల ప్రధాన పంటలతో పాటు రక్షక పంటలుగా మొక్క జొన్న, జొన్న మరియు ఎర పంటలుగా బంతి వేయడం మంచిదన్నారు. ఎస్ఎఫ్ఏ చక్రవర్తి, మోడల్ మేకర్ రామారావు, ఐసీఆర్‌పీ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నో ప్లాస్టిక్ జోన్‌గా రుషికొండ బీచ్

జిల్లా పర్యాటక శాఖ అధికారి జ్ఞానవేణి

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం, బ్లూఫ్లాగ్ గుర్తింపు పొందిన రుషికొండ బీచ్‌ను నో ప్లాస్టిక్ జోన్‌గా మార్చాలని జిల్లా పర్యాటక శాఖ అధికారి జ్ఞానవేణి పిలుపునిచ్చారు. బీచ్ వద్ద శనివారం నిర్వహించిన 'ప్లాస్టిక్ రహిత – పర్యావరణ సహిత' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బీచ్ వద్ద ప్లాస్టిక్ నిషేధించాలని కోరారు. ప్లాస్టిక్ వ్యర్థాల వలన వచ్చే విషవాయువులు జీవన శైలిని విచ్ఛిన్నం చేస్తాయని, అదేవిధంగా సముద్రంలో తాబేళ్లు, చేపలు వంటి జీవులు కూడా విచ్ఛిన్నం అవుతున్నాయని పేర్కొన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకుని ఇక్కడ దుకాణదారులు అందరూ ప్లాస్టిక్‌ను కచ్చితంగా నిషేధించాలని సూచించారు. ఇతర దేశాల నుంచి వచ్చే పర్యాటకులకు ఆహ్లాదకర వాతావరణం ఇవ్వాలని, ఎకో టూరిజం నిబంధనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఫిషరీ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ బామి రెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రంలో పడవేయడంతో సముద్ర జీవరాశులు నశిస్తున్నాయని, వాటిని పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్‌ను నిషేధించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీడీసీ డీఎం జగదీశ్, సబ్ డీఎఫ్ఏ శివాని, జీవీఎంసీ స్వచ్ఛత ప్రమోటింగ్ మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ప్లాస్టిక్‌పై అవగాహన కల్పిస్తున్న జిల్లా పర్యాటకశాఖ అధికారి జ్ఞానవేణి తదితరులు

పారదర్శకంగా అప్పన్న నగల పరిశీలన

దేవదాయ శాఖ జ్యూయలరీ వెరిఫికేషన్ అధికారి పల్లంరాజు


రికార్డులు పరిశీలిస్తున్న దేవదాయశాఖ అధికారి పల్లంరాజు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జ్యూయలరీ వెరిఫికేషన్ పారదర్శకంగా జరుగుతోందని రాష్ట్ర దేవదాయ శాఖ జ్యూయలరీ వెరిఫికేషన్ అధికారి పల్లంరాజు తెలిపారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి దాతలు కానుకగా సమర్పించిన బంగారు, వెండి, ఇతర విలువైన వస్తువుల రికార్డులను రెండవ రోజు శనివారం పల్లంరాజు తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ స్వామివారి బంగారం తాలూకా రికార్డులను ఇప్పటి వరకు పరిశీలించామని, మరో మూడు రోజుల పాటు వెండి వస్తువుల రికార్డుల పరిశీలన ఉంటుందన్నారు. రికార్డులు వెరిఫికేషన్ పూర్తి కాగానే ఒక్కో వస్తువుని తనిఖీ చేసి దానికి సంబంధించిన రికార్డు ఉందో లేదో పరిశీలిస్తామన్నారు. మరో పది రోజుల పాటు ఈ ప్రక్రియ జరుగుతుందన్నారు. ఏమాత్రం తేడా వచ్చినా కచ్చితంగా రికార్డు చేస్తామన్నారు. నివేదికను దేవదాయ శాఖ కమిషనర్‌కి పంపిస్తామన్నారు. అదే నివేదికను మీడియాకు కూడా విడుదల చేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆలయాల ఆభరణాల రికార్డులు త్వరలోనే డిజిటలైజేషన్ చేయాలని దేవదాయ శాఖకి సిఫారసు చేస్తామన్నారు. ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకి ఆభరణాలు సమర్పించే దాతలు తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలని తెలియజేసే విధంగా బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. కాగా దాతలు సమర్పించిన బంగారు, వెండి, ఇతర విలువైన వస్తువులు రికార్డుల ప్రకారం లేవని, వస్తువుల వివరాలను బహిర్గతం చేయాలని, వాటికి సంబంధించి రికార్డులు సక్రమంగా నిర్వహిస్తున్నారో లేదో తెలియపరచాలని కడప జిల్లాకు చెందిన కె.ప్రభాకరాచారి అనే వ్యక్తి దేవదాయ శాఖకి ఫిర్యాదు చేయడంతో ఈ విచారణ జరుగుతోంది.

అప్పన్నకు విశేషంగా నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై ఆశీనులను చేశారు. విష్వక్సేన పూజ, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయ దాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

- జోనల్ కమిషనర్ ప్రేమ ప్రసన్నవాణి
- భీమిలిలో 'స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్'


పొట్టి శ్రీరాములు పార్కులో చెత్తను తొలగిస్తున్న జెడ్సీ ప్రేమ ప్రసన్నవాణి

భీమునిపట్నం: పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని జోనల్ కమిషనర్ ప్రేమ ప్రసన్నవాణి అన్నారు. మన ఇల్లు, చుట్టుపక్కల ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా భీమిలి బీచ్ సమీపంలోని పొట్టిశ్రీరాములు పార్కులో చెత్త తొలగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. స్వచ్ఛ విశాఖను సాకారం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మూడో వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ పాల్గొన్నారు.

- మండల వ్యవసాయ అధికారి కార్యాలయం, అగ్రి ల్యాబ్ పరిసరాల్లో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు బి.విజయప్రసాద్ ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శివకోమలి, సిబ్బంది పాల్గొన్నారు.
- సింగనబంద వద్ద జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ గాడు వెంకటప్పుడు, సర్పంచ్ గాడు వెంకటనారాయణ, ఎంపీటీసీ పెదిరాజు పాల్గొన్నారు.

పంచాయతీల్లో..

పద్మనాభం: మండలంలోని పలు పంచాయతీల్లో శనివారం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమాలు జరిగాయి. బాందేవుపురంలో జరిగిన కార్యక్రమాన్ని జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి పరిశీలించారు. సీఈవో చీపురు చేత పట్టి ఈ పంచాయతీ సచివాలయం వద్ద చెత్త ఊడ్చారు.

- పద్మనాభంలో మండల పరిషత్ అధికారులు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.విజయ కుమార్, ఈవోఆర్డీ మీనా కుమారి పాల్గొన్నారు.

మధురవాడలో ..

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డు బక్కన్నపాలెం లచ్చిరాజు లే అవుట్‌లో గల స్పోర్ట్స్ థీమ్ పార్కు వద్ద జీవీఎంసీ జోన్–2 కమిషనర్ ఎంవీడీ ఫణిరాం ఆధ్వర్యంలో పార్కులో, పరిసరాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. సిబ్బందితో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జీవీఎంసీ అధికారులు, సిబ్బంది ప్లకార్డులు, బ్యానర్లు పట్టి పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు.

- 5వ వార్డు స్వతంత్రనగర్ పార్కు, పరిసరాల్లో కార్పొరేటర్ మొల్లి హేమలత పరిసరాలు శుభ్రం చేశారు.మహిళలు, యువత భాగస్వాములు అయ్యారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.
- మధురవాడ పీహెచ్‌సీలో వైద్యాధికారి ప్రశాంతి పరిసరాలు శుభ్రం చేశారు. సీహెచ్‌వో సౌభాగ్యమణి, పీహెచ్ఎన్ సత్యవతి, టీబీ సూపర్‌వైజర్ వీరబ్రహ్మం పాల్గొన్నారు.

ఎండాడలో..

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలోని చెరువు వద్ద జీవీఎంసీ అధికారులు శనివారం 'స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ దివస్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్కడ చెరువులో వ్యర్థాలను తొలగించారు. అనంతరం స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. కార్పొరేటర్ అప్పారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి పాల్గొన్నారు.

ఆనందపురంలో..

మధురవాడ: ఆనందపురం మండలం గొట్టిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం, పరిసర ప్రాంతాలు, ఇతర గ్రామాలను డీపీవో శ్రీనివాస్ సందర్శించారు. ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొని, సూచనలు చేశారు. సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

- ఎంపీడీవోజానకి ఆధ్వర్యంలో పలు పంచాయతీల్లో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. జనవరి థీమ్‌లో భాగంగా మండల పరిషత్ కార్యాలయం వద్ద సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు.



స్వచ్ఛత కార్యక్రమంలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న జెడ్సీ ఫణిరాం, అధికారులు


బాందేవుపురం సచివాలయం వద్ద చెత్త ఊడ్చుతున్న జెడ్పీ సీఈవో నారాయణమూర్తి


మధురవాడ పీహెచ్‌సీలో చీపురు పట్టి శుభ్రం చేస్తున్న వైద్యాధికారి ప్రశాంతి


ఎండాడ వద్ద స్వచ్ఛత ప్రతిజ్ఞ చేస్తున్న జీవీఎంసీ అధికారులు


గొట్టిపల్లి సచివాలయం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న డీపీవో శ్రీనివాస్


ఆనందపురం మండల కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీవో జానకి

ప్రమాదమని తెలిసీ..

- హైవేలో రాంగ్‌రూట్‌లో ప్రయాణం
- సర్వీసు రోడ్లు లేక వాహనదారుల ఫీట్లు
- లా కాలేజ్ జంక్షన్ నుంచి పరదేశిపాలెం వరకు ఇదే పరిస్థితి

మధురవాడ: మధురవాడ పరిసర ప్రాంతాల్లో సర్వీస్ రోడ్డు, రోడ్ క్రాసింగ్ సదుపాయాలు లేక వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. ప్రమాదకరమని తెలిసినా వన్‌వేలో రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

ఎండాడ లా కాలేజీ జంక్షన్ నుంచి పరదేశిపాలెం వరకు సుమారు 6 కిలోమీటర్ల మేర 16వ నెంబర్ జాతీయ రహదారి విస్తరించి ఉంది. దీనిని ఆనుకుని లా కాలేజీని ఆనుకుని ఉన్న ఎంవీవీ సిటీ, ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం, కార్‌షెడ్, మధురవాడ, కొమ్మాది జంక్షన్, గాయత్రి ఆస్పత్రి, వైఎస్సార్ కాలనీ, మారికవలస జంక్షన్, కాలనీలు, బోయిపాలెం, పరదేశిపాలెంలో నివాస, ఇతర ముఖ్యమైన ప్రాంతాలు ఉన్నాయి. వీటిలో ముఖ్యమైన ప్రాంతాలలో సర్వీసులు, రోడ్డు క్రాసింగ్ సదుపాయాలు లేక వాహనాలు నడిపే వారు రాంగ్ రూట్‌లో ప్రయాణాలు సాగిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో జీవీఎంసీ వాహనాలు కూడా ఇదే దారి పడుతున్నాయి.

గతంలో ప్రారంభించినా..

హైవేను ఆనుకుని ఉన్న వివిధ ప్రాంతాలలో రోడ్డు దాటడానికి రెయిలింగ్, డివైడర్ల కారణంగా సుదూరంలో ఉన్న ప్రదేశాలు చేరుకోవడానికి కిలోమీటర్లు ప్రయాణించాల్సి వచ్చేది. మరికొందరు అంతదూరం వెళ్లలేక, రాంగ్‌రూట్‌లోనే ప్రయాణించడంతో ప్రమాదాన్ని గుర్తించి గతంలో సర్వీస్ రోడ్ల నిర్మాణం ప్రారంభించారు. ఇందులో భాగంగా కొమ్మాది జంక్షన్ నుంచి వైఎస్సార్ కాలనీ వరకు పనులు పూర్తి చేశారు. ఈలోగా ఎన్నికల కోడ్ వచ్చి పనులు నిలిచిపోయాయి. ఆ తర్వాత ఈ విషయం పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు.


గాయత్రీ హాస్పిటల్ వద్ద సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాల్సింది ఇక్కడే..


మారికవలస పెట్రోల్ బంక్ నుంచి వన్‌వేలో రాకపోకలు

సర్వీసు రోడ్లు ఏర్పాటు చేయాల్సిన ప్రాంతాలు

- ఎండాడ లా కళాశాల జంక్షన్–క్రికెట్ స్టేడియం సిగ్నల్ వరకు రెండు వైపులా..
- కొమ్మాది పాత జంక్షన్ పాత సిగ్నల్ నుంచి ఎస్‌టీబీఎల్, ఓజోన్ వ్యాలీ వైపు మారికవలస జంక్షన్ వరకు..
- కొమ్మాది వైఎస్సార్‌కాలనీ జంక్షన్ నుంచి మారికవలస–తిమ్మాపురం డబుల్ రోడ్ వరకు
- మారికవలస జంక్షన్ నుంచి బోరవానిపాలెం సమీపంలో డంపింగ్ యార్డు జంక్షన్ వరకు ఇరువైపులా..
- పాత పరదేశిపాలెం నుంచి కొత్త పరదేశిపాలెం వరకు..
- కొత్త పరదేశిపాలెం నుంచి బోయిపాలెం జంక్షన్‌ను కలిపే ప్రాంతం

చాలా ఇబ్బంది పడుతున్నాం



క్రికెట్ స్టేడియం, కొమ్మాది జంక్షన్, మారికవలస తదితర అత్యంత రద్దీ ప్రాంతాలలో కూడా సర్వీసు రోడ్లు లేక ఇబ్బంది పడుతున్నాం. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. గతంలో ప్రారంభించిన పనులైనా పూర్తి చేయాలి.

– వెంకట్, ప్రైవేట్ ఉద్యోగి, మధురవాడ

నవోదయ ప్రవేశ పరీక్షకు 414 మంది హాజరు

భీమునిపట్నం: నవోదయ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి శనివారం భీమిలి పరిధిలో నిర్వహించిన పరీక్షకు 414మంది విద్యార్థులు హాజరయ్యారని మండల విద్యాశాఖ అధికారి శివరాణి తెలిపారు. ఇక్కడ మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. భీమిలిలోని ఏపీ బాలికల గురుకుల పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మొత్తం 545మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 414మంది హాజరయ్యాయని తెలిపారు. 131 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.